# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-06-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1) పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించిన "మీ భూమి-మీ హక్కు" కార్యక్రమంలో రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

**2) రాష్ట్రంలో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్.**

**3) యోగ సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్న మంత్రి కందుల దుర్గేష్.**

**4) ప్రజా సమస్యల పరిష్కారం, రైతులకు సాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్న హోంశాఖ మంత్రి వి.అనిత.**

==========================

పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతం గ్రామంలో నిర్వహించిన "మీ భూమి-మీ హక్కు" కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ చర్యలు చేపడుతోందన్నారు. రీ సర్వే నిర్వహించి నూతన పట్టా పుస్తకాలను అందజేస్తున్నామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ....

..వాయిస్..27 సెకన్లు

--------------------------

బీహార్‌లోని ఔరంగాబాద్ సమీపంలో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన కాశీ యాత్రికుల బస్సు గత రాత్రి ప్రమాదానికి గురైన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రమాద ఘటనపై ఈరోజు అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి, క్షతగాత్రులకు అందుతున్న వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నెల్లూరు జిల్లా నుంచి 46 మంది యాత్రికులతో కాశీకి వెళ్తున్న బస్సు ఔరంగాబాద్ వద్ద మరో వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు వివరించారు. ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, 15 మంది గాయపడినట్లు తెలిపారు.

క్షతగాత్రులకు తక్షణ వైద్యసాయం అందేలా చర్యలు తీసుకోవాలని, బీహార్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని బాధితులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం టిడ్కో కాలనీలో నూతనంగా నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాన్ని మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సబ్‌స్టేషన్ ప్రారంభంతో ధర్మవరం పట్టణం, పరిసర ప్రాంతాలకు మరింత నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలు పలు జిల్లాలలో కొనసాగుతున్నాయి. నంద్యాల జిల్లాలోని శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం సిబ్బంది, ప్రజలతో కలిసి జాయింట్ కలెక్టర్ యోగాసనాలు వేశారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి దేవస్థానంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి యోగా సాధన చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో కలెక్టర్ కార్యాలయం ఎదుట యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు యోగా సాధనలో పాల్గొని, యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యాలు మెరుగుపడతాయని అన్నారు.

---------------------------

యోగ సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడి సానుకూల జీవన విధానం అలవడుతుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో “ఖైదీలతో యోగా” ఇతివృత్తంతో యోగాంధ్ర-2026 కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీలతో సామూహిక యోగా సాధన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నమంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ,

వాయిస్...30 సెకన్లు

---------------------------

ప్రజా సమస్యల పరిష్కారం, రైతులకు సాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వి.అనిత అన్నారు. అనకాపల్లి జిల్లా వేమగిరిలో 70 లక్షల నాబార్డ్ నిధులతో నిర్మించిన ధర్మవరం-ఎలమంచిలి రహదారిని, అలాగే విశాఖ డైరీ సహకారంతో నిర్మించిన కళ్యాణ మండపాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. రైతులకు సాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

-----------------------------

రాజ్యసభ అభ్యర్థులుగా తెలుగుదేశం పార్టీకి చెందిన సానా సతీశ్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ ఈ రోజు తమ నామినేషన్లు దాఖలు చేశారు. రాజధాని ప్రాంతంలోని వెంకటపాలెం టీటీడీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శాసనసభకు చేరుకున్నారు. అసెంబ్లీలో ఎన్నికల అధికారికి తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీ శాసనసభ్యులు వీరి నామినేషన్లను బలపరిచారు. వీరిలో సానా సతీశ్ రెండోసారి రాజ్యసభకు పోటీ చేస్తుండగా, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ తొలిసారిగా పోటీ చేస్తున్నారు.

-----------------------------

గత 12 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం పేదల సాధికారత, సమ్మిళిత అభివృద్ధి, సంక్షేమాన్ని లక్ష్యంగా అమలు చేసిన కార్యక్రమాలు కోట్లాది మంది ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువచ్చాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. 12 ఏళ్ళ ఎన్డీయే పాలనపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ఈ రోజు స్పందిస్తూ, ఆర్థిక చేయూత నుంచి ఆరోగ్య సంరక్షణ, గృహవసతి, పారిశుధ్యం, విద్యుత్, ఆహార భద్రత వరకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచాయని తెలిపారు.

-----------------------------

పుంగనూరు బ్రాంచ్ కాలువ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని మాజీ పార్లమెంట్ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తలారి రంగయ్య ప్రభుత్వాన్ని కోరారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని పుంగనూరు బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులను పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా తలారి రంగయ్య మాట్లాడుతూ, ప్రజాధనం వెచ్చిస్తున్న ప్రాజెక్టుల్లో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, రైతులకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలని కోరారు. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని, లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని ప్రభుత్వాన్ని కోరారు.

-----------------------------

రాష్ట్రంలో ఎరువుల పంపిణీని సమర్థవంతంగా నిర్వహించేందుకు రూపొందించిన రాష్ట్ర వ్యవసాయ సమాచార నిర్వహణ వ్యవస్థ –ఏపీఎఐఎంఎస్ 2.0 యాప్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని వ్యవసాయ శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ అధికారులతో మంత్రి నిన్న విజయవాడ నుంచి దృశ్య,శ్రవణ మాధ్యమ విధానంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కొత్త విధానం అమలుతో కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

=====================